అన్ని రంగాల్లో విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి

పీయూ ఉప కులపతి డా.జీఎన్ శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఉపకులపతి (వీసీ) డా.జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విశ్వవిద్యాలయానికి రాగా రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీయూకు తాను ఉపకులపతిగా రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. 29 ఏళ్ల నుంచి తాను బోధనా రంగంలోనే ఉన్నానని, విశ్వవిద్యాలయాన్ని ఎలా అభివృద్ధి చేయాలో తనకు తెలుసని పేర్కొన్నారు. ఎక్కువ మంది గ్రామీణ విద్యార్థులే ఉంటారని, వారికి అన్ని


వీసీ డా.జీఎన్ శ్రీనివాస్‌కు మొక్క అందిస్తున్న రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు

రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. విద్యతోపాటు సహ పాఠ్య అంశాలు, పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయటంపై దృష్టిసారిస్తామని తెలిపారు. తరగతులు, వసతి గృహాలు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిపాలన, పర్యవేక్షణ తదితర అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. వచ్చే ఏడాది న్యాయ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలలను ప్రారంభిస్తామన్నారు. పీయూ అభివృద్ధికి ప్రభుత్వ, తాత్కాలిక, పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగుల సహకరించాలని, ఎలాంటి సమస్య ఉన్నా.. నేరుగా తన వద్దకు రావచ్చని తెలిపారు. పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్, అధికారులు విజయలక్ష్మి, శాంతిప్రియ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రవీణ, ప్రిన్సిపల్స్ చంద్రకిరణ్, నూర్జహాన్, బషీర్ అహ్మద్, వెంకట్‌రెడ్డి, భగవంతురెడ్డి, భాస్కర్, జైపాల్‌రెడ్డి, కుమారస్వామి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టారు.. ఇదేం పని?

కొందరు ఉపాధ్యాయుల గైర్హాజరుపై ఆరోపణలు

కందనూలు, అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని వివిధ మండలాల్లోని కొందరు ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల అండదండలతో తరుచుగా పాఠశాలలకు గైర్హాజరువుతున్నారు. పలువురు వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ పాఠశాలకు సమయం ప్రకారం హాజరు కావడం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాలలను పర్యవేక్షించే జిల్లా విద్యాశాఖ అధికారులే విధులకు గైర్హాజరయ్యే ఉపాధ్యాయులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మండల రిసోర్సు కేంద్రం (ఎమ్మార్సీ) పనిచేసే స్ట్రాంగ్ టీచర్ వ్యవస్థను 2012లో రద్దు చేసినా ఇప్పటికి కొందరు ఉపాధ్యాయులు స్ట్రాంగ్ టీచర్ పేరుతో పాఠశాలలకు హాజరు కాకుండా ఎమ్మార్సీ కేంద్రాల్లో ఉంటూ తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని పైరవీలు చేస్తున్నారని విమర్శలున్నాయి. దీని వలన పలు పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు ముందుకు సాగడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు ఇలా..

నాగర్‌కర్నూల్ ఎమ్మార్సీలో విధులు నిర్వహించే ఓ స్ట్రాంగ్ టీచర్‌కు ఇటీవలి కాలంలో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది.


పెంట్లవెల్లి మండలం జటప్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు (పాత చిత్రం)

సదరు ఉపాధ్యాయుడు పెంట్లవెల్లి మండలంలోని ఓ పాఠశాలలో బాధ్యతలు తీసుకున్న రోజు మాత్రమే హాజరయ్యారు. రెండు నెలలుగా పాఠశాలకు హాజరు కాకుండా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తిష్ఠవేసి పైరవీలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆ ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకపోవడం వలన 8, 9, 10 తరగతుల భౌతిక శాస్త్రం పాఠాలు ముందుకు సాగడం లేదని విద్యార్థులు ఆందోళన చేశారు. దీంతో ఇదే మండలంలోని ఓ పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయుని సర్దుబాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోగా తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

● ఉప్పునుంతల, అమ్రాబాద్ మండలంలో ఒక్కొక్కరి చొప్పున ఇద్దరు ఉపాధ్యాయులు స్ట్రాంగ్ టీచర్ల పేరుతో పాఠశాలకు హాజరు కావడం లేదు. ఈ ఇద్దరు ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల అండదండలు, పలుకుబడితో వివిధ రకాల పైరవీలు చేస్తున్నారని, ఓ పార్టీ కార్యక్రమంలో తరుచు పాల్గొంటున్నారన్న ఆరోపణలున్నాయి.

● అమ్రాబాద్ మండలంలో విధులు నిర్వహించే ఓ ఉపాధ్యాయుడు సెప్టెంబర్ 26న గుప్తనిధి తవ్వకాల్లో పట్టుబడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	816
విద్యార్థులు	65 వేల మంది
ఉండాల్సిన ఉపాధ్యాయులు	3,742
ప్రస్తుతం ఉన్నవారు	3,587

పర్యవేక్షణ చేస్తేనే ప్రయోజనం

విద్యా వ్యవస్థను మెరుగుపర్చడానికి ప్రభుత్వం పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో మొత్తం 20 మండలాలకు గాను ప్రస్తుతం 19 మంది ఎంఈవోలు కొనసాగుతున్నారు. జిల్లాలోని విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలు ప్రతి రోజు పాఠశాలలను పర్యవేక్షణ చేస్తూ విధులకు డుమ్మ కొట్టే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడంతో పాటు స్ట్రాంగ్ టీచర్‌లను వారు విధుల నిర్వహించే పాఠశాలలకు పంపించాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు. పర్యవేక్షణ చేస్తున్నామని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవని డీఈవో గోవిందరాజులు తెలిపారు.


పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

అమరుల త్యాగాలు మరువలేనివి

కందనూలు, న్యూస్‌టుడే : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు ఎప్పటికి మర్చిపోలేమని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పాత పోలీసు పరేడ్ మైదానంలో కలెక్టర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి కలెక్టర్ అమరువీరుల స్తూపం వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. దేశాన్ని కాపాడేవారు సైనిక జవాన్లు అయితే అంతర్గత శక్తుల నుంచి ప్రజలను కాపాడి, వారి భద్రతకు భరోసా ఇస్తూ, సామాజిక ఆస్తులు రక్షించేది పోలీసులని పేర్కొన్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పోలిస్తే పోలీసులు విధి నిర్వహణలో తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేస్తూ శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారన్నారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ.. అమరవీరుల కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం పరేడ్ మైదానం నుంచి ప్రయాణ ప్రాంగణం వరకు అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.


అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది పాల్గొన్న జిల్లా ఎస్పీ

ఓటరు జాబితాలో పేరు నమోదుపై అవగాహన

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : 18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీతారామారావు మాట్లాడారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 స్వీప్ కార్యచరణను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో డీఆర్‌డీవోను నోడల్ అధికారిగా నియమించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. చెంచులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి చిన్న ఓబులేసు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ. 2,160



అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. సోమవారం వివిధ గ్రామాలకు చెందిన రైతులు మొక్కజొన్న ధాన్యం అమ్మేందుకు అచ్చంపేట మార్కెట్‌కు తెచ్చారు. మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ. 2,160 మాదిరి ధర రూ. 1,950 కనిష్ఠ ధర రూ. 1,632 వంతున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి నరసింహులు తెలిపారు.

రైతేరాజు 6లో..

అక్రమాల దస్త్రం మరుగున పడినట్లేనా?

ధరూరు న్యూస్‌టుడే: గొర్రెల పంపిణీపై గత కొన్ని నెలల క్రితం ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది. నెలలు గడుస్తున్న కొద్దీ అక్రమాలపై విచారణ ఊసే కనిపించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నది. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో మరో ముగ్గురు అధికారుల అరెస్టులు తప్ప పెద్దగా విచారణలో పురోగతి కనిపించడం లేదు. ఈ పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో రీసైక్లింగ్ ద్వారా పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. అధికారులతోపాటు కొందరు గొర్రెల పంపెకందారుల సంఘం అధ్యక్షుల పాత్ర కూడా ఈ అవకతవకల్లో ఉందన్నది స్పష్టం. కాని క్షేత్ర స్థాయిలో దీనిపై ఎలాంటి విచారణ చేపట్టడం లేదు. దీంతో అక్రమార్కులపై చర్యలు ఉంటాయో? లేదోనన్న? అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయి.


లబ్ధిదారులకు పంపిణీ చేసిన గొర్రెలు


గొర్రెల్ని సక్రమంగా లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అప్పట్లో ఓ అధికారిని సస్పెండ్ చేశారు. గద్వాల జిల్లాలో అధికారులు అనంతపురం వెళ్లి ఏజెంట్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులున్నాయి. నాడు అక్కడ పని చేసిన ఏడీ డబ్బు పంపిణీ వ్యవహారంలో గొడవకు దిగినట్లు ఆరోపణలొచ్చాయి.

కాగ్ గుర్తించిన అంశాలు..

గొర్రెల పంపిణీలో జరిగిన అనేక అక్రమాలను కాగ్ గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 70,688 యూనిట్లు పంపిణీ చేశారు. దీని కోసం ప్రభుత్వ నిధులు రెండు విడుతల్లో రూ. 730 కోట్ల వరకు ఖర్చు చేశారు. కాగ్ పరిశీలనలో మహబుబ్‌నగర్ జిల్లాలో 108 గొర్రెలను ఒక కారులో తరలించినట్లుగా రికార్డుల్లో పొందుపరిచినట్లు గుర్తించింది. ఇక్కడ రవాణా వాహనం డీసీఎం నంబరు బదులు కారు నంబరు నమోదు చేశారు.

● ఒకే సమయంలో ఒకే వాహనంలో వేర్వేరు ప్రాంతాల నుంచి గొర్రెలు తరలించినట్లు రికార్డుల్లో నమోదై ఉంది. శ్రీకాకుళం, కడప, కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి కూడా ఇదే వాహనంలో తరలించినట్లు రికార్డుల్లో ఉంది.

● ధన్వాడ మండలానికి వచ్చిన



● పలు నియోజకవర్గాల పరిధిలో విజిలెన్స్ విచారణలో బయటపడిన వాస్తవాలు అందరినీ విస్మయాలనికి గురి చేశాయి. చాలాచోట్ల యూనిట్లే కనిపించని దాన్ని విచారణలో గుర్తించారు. నాగర్ కర్నూల్ జిల్లా మాచర్ల కేంద్రంగా పెద్ద ఎత్తున రీసైక్లింగ్ జరిగినట్లు ఆరోపణలొచ్చాయి.

● వనపర్తి జిల్లాలో కొత్తకోట, మదనాపురం మండలాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. జడ్చర్ల, మానవపాడు ఠాణాల్లో గొర్రెల రీసైక్లింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. అప్పట్లో క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ చేసి నివేదికలు ఇవ్వాల్సిందిగా జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు నివేదికల ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణగానీ అక్రమార్కులపై చర్యలుగానీ లేవు. అసలు పంపిణీలో అక్రమాలపై విచారణ జరుగుతుందా? దస్త్రం మూసేస్తారా? అన్నదానిపై మాకే స్పష్టత లేదని ఉమ్మడి జిల్లాలో పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పశువైద్యాధికారి చెప్పుకొచ్చారు.

రెండు విడతల్లో పంపిణీ చేసిన గొర్రెలు	
మహబూబ్‌నగర్	16,721
నాగర్‌కర్నూల్	19,127
వనపర్తి	14,511
గద్వాల	10,525
నారాయణపేట	9,804

చిన్నారులకు భరోసా

ఆర్బీఎస్‌కే ద్వారా విద్యార్థులకు వైద్యసేవలు

న్యూస్‌టుడే, పాలమూరు : ప్రభుత్వ పాఠశాలల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్‌కే) అండగా నిలుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 7, నాగర్‌కర్నూల్‌లో 10, నారాయణపేటలో 5, వనపర్తిలో 8, జోగులాంబ గద్వాల జిల్లాలో 5 చొప్పున మొత్తం 35 ఆర్బీఎస్‌కే వైద్య బృందాలు పని చేస్తున్నాయి. ప్రతి బృందంలో ఇద్దరు వైద్యులు (ఆడ, మగ), ఒక ఫార్మసిస్టు, ఏఎన్ఎం ఉంటారు. వారికి వాహన సౌకర్యం కూడా ఉంటుంది. బృందాల సభ్యులు వారంలో ఐదు రోజులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి సమీపంలోని ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారు.

రక్తహీనత బాధితులే ఎక్కువ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,48,556 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అందులో అనేక రకాల అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న 6,143 మంది చిన్నారులను గుర్తించారు. వారిని మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహించే డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డైక్)కు పంపించారు. వివిధ విభాగాలకు చెందిన 13 మంది వైద్యులు అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. చిన్నారుల్లో తీవ్ర రక్తహీనత, దంత సంబంధ సమస్యలు, పోషకాహారలోపం ఎదుర్కొంటున్నవారు ఎక్కువ మంది ఉన్నారు.


మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : మా వైద్య బృందాలు రోజూ పాఠశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రతి శనివారం అనారోగ్య బాధితుల వివరాలు మాకు సమర్పిస్తారు. చిన్నారులను కూడా మహబూబ్‌నగర్‌కు తీసుకొస్తారు. వారి అనారోగ్య సమస్యలు పూర్తిగా నయమయ్యే వరకు మెరుగైన చికిత్సలు అందిస్తాం. ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం.

- దేవీదాసు, ఆర్బీఎస్‌కే మేనేజర్, మహబూబ్‌నగర్ జిల్లా

చిన్నారుల అనారోగ్య సమస్యలివే..

అనారోగ్య సమస్య	బాధితులు
తీవ్ర రక్తహీనత	692
దంత సమస్యలు	682
పోషకాహారలోపం	386
దృష్టిలోపం	156
మాట్లాడలేకపోవడం	156
రుతుచక్ర సమస్యలు	151
నరాలు, ఎముకలు	145
బుద్ధి మాంద్యం	51
ప్రవర్తన సమస్యలు	39
గుండె సమస్యలు	32
అభ్యసన వైకల్యాలు	26
నిరాసక్తత	18
గ్రహణ మొర్రి	14
రక్తమార్పిడి	07
వంకర కాళ్లు	06
కర్ణభేరి సమస్యలు	02

పంటల సర్వేపై చిక్కుముడి


సాగు పనుల్లో రైతులు (పాతచిత్రం)

కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగుపై డిజిటల్ సర్వే చేయాలని ఏఈవో (వ్యవసాయ విస్తరణ అధికారు)లను ఆదేశించడంతో వారు నిరాకరించడం సర్వే సందిగ్ధంలో పడింది. కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయంపై రూపొందించిన ఈ యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేస్తున్న భూముల వివరాల్ని నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వేకు కేంద్రం నిధులు కేటాయించగా కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖ ప్రత్యేక వాలంటీర్లను నియమించి సర్వే చేపడుతోంది. కాగా తెలంగాణలో మాత్రం ఏఈవోలే వీటిని చేయాలంటూ ఆదేశించింది. దీనిని వ్యతిరేకిస్తున్న ఏఈవోలు విధులకు హాజరవుతున్నా గత నెల 24 నుంచి గైర్హాజరు వేస్తున్నారు. విధులను ఖాతారు చేయని అవుట్ సోర్సింగ్ ఏఈవోలను విధుల నుంచి తొలగిస్తామని మెమోలు జారీ చేశారు. దీంతో రెగ్యులర్ ఏఈవోల్లో ఆందోళన నెలకొంది. అయినప్పటికీ సర్వే మాత్రం ముందుకు సాగడం లేదు.

● గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న వారి వివరాలే కాకుండా సాగులోకి వస్తున్న భూములు, పంటలు వంటివి డిజిటల్‌లో నమోదు చేయడం వల్ల వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి పట్టు సాధించడం వీలవుతుందని ఈ సర్వేను నిర్దేశించారు. ఇప్పటి వరకు ధరణి నమోదు ఆధారంగా గ్రామాల్లో వీఆర్ఏ, కావలికారు వంటివారి సహకారంతో రైతు చెప్పిన విధంగా పంటల సాగును వ్యవసాయశాఖ నమోదు చేసేది. వీటన్నింటికీ చెక్‌పెడుతూ సర్వే నంబర్, సాగు ఫొటో ఆధారంగా పంటలు నమోదు చేస్తారు. ఈ సర్వే వివరాల ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను ఇద్దామని యోచిస్తోంది.

ఒక్కరికి అసాధ్యమే ! : గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి అక్కడి నుంచే ఫొటోలతో ఆయా రైతు వివరాలను నమోదు చేయాలంటే ఒక్క ఏఈవోల తోనే సాధ్యమయ్యే పనికాదని వారు చెబుతున్నారు. తమకు సహాయంగా మరొకరిని ఇస్తే గాని గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేయలేమన్నది వారి వాదన. ఏఈవోలుగా స్త్రీలు పని చేస్తున్నారని ఒక్కరే అడవులు, చెరువులు, కుంటలు తిరుగుతూ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడం సులభమైన పని కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంటి అటవీ ప్రాంత వ్యవసాయ క్షేత్రాల్లో ఇది మరింత ఇబ్బందికరమని మహిళా ఏఈవోలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాఖలో 49 రకాల పనుల్ని చక్కబెడుతున్న తమకు డీటీఎస్ తీవ్ర ఇబ్బందులు కలిగించే అంశంగా వారు భావిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో వీరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదు. అందులోనే వ్యక్తిగత హాజరు నమోదు చేయాలని నిర్దేశించినప్పటికీ ఈ విధులకు దూరంగా ఉంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో రైతులు సాగు చేసిన భూమి వివరాలు...

జిల్లా	రైతులు	సాగు భూములు (ఎకరాల్లో)
నాగర్‌కర్నూల్	1,26.549	5,62,299
నారాయణపేట	1,38,267	4,64,440
జోగులాంబ గద్వాల	2,58,901	3,40,677
మహబూబ్‌నగర్	1,76,474	3,21,512
వనపర్తి	1,30,894	2,35,250
మొత్తం	8,31,085	19,24,178

వినతుల నివేదికలు ఆన్‌లైన్‌లో నమోదు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ప్రజావాణిలో వచ్చిన వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజావాణికి 65 దరఖాస్తులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు ఆరా తీశారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టుకోకుండా అధికారులు ఎప్పట్టికప్పుడు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, జడ్పీ డిప్యూటీ సీఈవో గోపాల్, ఎవో చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.



సాగు భూములకు పట్టాలు ఇప్పించండి: పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్ గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు 90 మంది ఉన్నారు. కొత్తపేట శివారులోని సర్వే నంబరు 176, 177లో తరతరాల నుంచి వస్తున్న భూములను సాగు చేసుకుంటున్నాం. 1935 నుంచి భూములను సాగు చేసుకుంటున్నాం. అధికారుల చుట్టూ తిరుగుతున్నా మా సమస్యను పరిష్కరించడం లేదు.

- వెంకటస్వామి, సాతాపూర్, పెద్దకొత్తపల్లి



చెంచులకు రేషన్ కార్డులు ఇప్పించండి: బల్మూరు మండలంలోని అంబగిరి గ్రామంలో ఉన్న చెంచులు 13 మందికి రేషన్‌కార్డులు లేవు. కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చే బియ్యం మాకు అందటం లేదు. పేదలుగా ఉన్న చెంచులను ఆదుకోవాలి.

- లింగస్వామి, అధ్యక్షులు, అంబగిరి చెంచు మహాలక్ష్మి గ్రామ సంఘం, అంబగిరి

ఒక్కొక్కరుగా దూరమై.. జీవనం భారమై!

మానవీయం


తల్లిదండ్రుల చిత్రపటంతో స్నేహ

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే : అమ్మానాన్నలు, సోదరుడు, తాత, నానమ్మలను వరుసగా కోల్పోయి ఓ యువతి అనాథగా మిగిలిన దయనీయ గాథ ఇది. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల కేంద్రానికి చెందిన బి.రాములుది పేద కుటుంబం. ఆయనకు భార్య జయమ్మ, తండ్రి అనంతయ్య, తల్లి మాసమ్మ, కుమారుడు సాయికిరణ్, కుమార్తె స్నేహ ఉన్నారు. కూలి పనులతో వచ్చే అరకొర ఆదాయంతో జీవనం సాగించే ఆ కుటుంబాన్ని మధుమేహం కబలించింది. తాము మధుమేహం బారినపడ్డామన్న విషయాన్ని రాములు, జయమ్మ ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే పరిస్థితి చేయిదాటి అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. 2014లో జయమ్మ చనిపోయారు. మరుసటి సంవత్సరం రాములు మరింత అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రి ఖర్చులకు ఎకరం పొలాన్ని అమ్మినా ఫలితం లేకపోయింది. 2016లో ఆయన మృతిచెందారు. అమ్మానాన్నలు లేకున్నా అన్న, తాత, నానమ్మ ఉన్నారని స్నేహ అనుకున్నంతలోనే మరొకరిని కోల్పోవాల్సి వచ్చింది. కుమారుడు, కోడలును కోల్పోయిన దిగులుతో వృద్ధుడైన అనంతయ్య 2017లో మరణించారు. కొంతకాలానికి అన్న సాయికిరణ్ అనారోగ్యం పాలయ్యారు. 2024 ఆగస్టు 26న ఆయన చనిపోయారు. వృద్ధాప్యంతో నానమ్మ మాసమ్మ 2024 సెప్టెంబరు 16న మరణించారు. నెల వ్యవధిలోనే అన్న, నానమ్మ దూరమయ్యారు. విధి పగబట్టినట్లుగా కుటుంబంలోని ఒకరి తర్వాత మరొకరిని.. మొత్తం ఐదుగురిని బలి తీసుకోవటంతో స్నేహ అనాథగా మారింది. ఆమెను తీవ్రంగా కుంగదీసింది. ప్రస్తుతం స్నేహ మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. ఉన్నత విద్య అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ఆమె కలలన్నీ కరిగిపోయి కన్నీరే మిగిలింది. కుటుంబ సభ్యులను తలచుకుని దుఃఖిస్తూ.. శిథిలావస్థకు చేరిన పాత పెంకుటిల్లులో బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. అనాథగా మారిన స్నేహకు ప్రభుత్వం అండగా నిలవాలని, ఆమెను వసతి గృహంలో చేర్పించి ఉన్నత విద్య చదివించటంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బంతి తోట.. లాభాల బాట

రైతేరాజు


తోటలో రైతు లక్ష్మమ్మ

ధన్వాడ, న్యూస్‌టుడే : గాలి ఉన్నప్పుడే తూర్పార బట్టాలి అనే నానుడిని వంట బట్టించుకున్న నారాయణపేట జిల్లా మరికల్‌కు చెందిన మహిళా రైతు పోలమోని లక్ష్మమ్మ.. బంతి పూలసాగులో ప్రణాళికతో ముందుకెళ్తూ ఏటా లాభాలు అందుకుంటున్నారు. ఈమెకు 2.30 ఎకరాల పొలం ఉంది. ఓ చోట రెండెకరాలు, మరో చోట 30 గుంటల భూమి ఉంది. ఇందులో అర ఎకరాలో బంతిపూలు సాగు చేశారు. బతుకమ్మ వేడుకలు ప్రారంభానికి నలభై రోజుల ముందు నారు నాటుతారు. పూల దిగుబడి అప్పటి నుంచి మొదలైతే దీపావళి, కార్తిక పౌర్ణిమ వరకు కొనసాగుతుంది. ఈ సీజన్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది.

ఖర్చు రూ.20 వేలు.. లాభం రూ.50 వేలు: నారు నాటినప్పటి నుంచి పూలు చేతికి వచ్చే వరకు రూ.20 వేలు ఖర్చు అవుతుందని లక్ష్మమ్మ తెలిపారు. తొలి కాపు పూలు విక్రయించగా చేతికి రూ.30 వేలు దక్కాయని, పెట్టుబడి పోగా రూ.పది వేలు ఆదాయం వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం రెండో కాపులో పూలు విరగకాశాయని వీటిని విక్రయిస్తే కనిష్ఠంగా మరో రూ.40 వేలు లాభం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నీటి తడులు అందిస్తే మూడో కాపు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పూలకు డిమాండ్ ఉంటే మరో రూ.30 వేలు వస్తాయన్నారు. గతేడాది మూడు కాపులు బాగా కాశాయని ఆమె తెలిపారు.

గత ఏడాది రూ.లక్ష వరకు విక్రయాలు: నా పొలం పట్టణానికి సమీపంలో ఉండటంతో రోజూ నా భర్త ఉదయం, సాయంత్రం వెళ్లి పర్యవేక్షిస్తారు. బంతిపూల సాగుకు శ్రమ పడాల్సిన అవసరం ఉండదు. గతేడాది రూ.లక్ష వరకు విక్రయాలు జరిగాయి. పెట్టుబడి పోగా రూ.80 వేలు దక్కాయి. ఈ సారి రెండో కాపు వరకు రూ.70 వేలు చేతికి దక్కుతాయి. మూడో కాపులో డిమాండ్ ఉంటే రూ.లక్ష వరకు అమ్మకాలు జరుగుతాయి.

- పోలమోని లక్ష్మమ్మ, మరికల్

ముర్రుపాలు దూడలకు మేలు

బాలానగర్, న్యూస్‌టుడే : లేగ దూడలకు పోషణపరంగా శ్రద్ధ తీసుకుంటే అవి సకాలంలో మంచి పాడిపశువులుగా ఎదుగుతాయని పశువైద్యాధికారి రఘురాం కుమార్ తెలిపారు. చూడి పశువులకు ఏడో నెల నుంచే అదనంగా దాణా ఇవ్వాలని సూచించారు. దూడల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపొందించేందుకు రోజుకు రెండు, మూడు సార్లు చొప్పున మొదటి మూడు రోజులు ముర్రుపాలు తాగించాలి. పుట్టిన గంటలోపే ఇవ్వాలి. తాగలేని దూడలకు తల్లి వద్ద నిలబెట్టి తాగేలా సహకరించాలి. లేదంటే సీసాలో పోసి పాల పీక అమర్చి తాపాలి. వీటిలో శక్తినిచ్చే పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా దూడలను వ్యాధుల బారి నుంచి రక్షించే ‘అంటినాడిస్’ ఇందులో ఉంటాయి. వీటిని తాగని దూడల్లో పారుడు వ్యాధులు, ఏలిక పాములు ఆశిస్తాయి. వీటి వల్ల దూడలకు మలబద్ధకం సమస్య ఉండదని రఘురాం కుమార్ తెలిపారు.

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కి ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

మేలైన వంగడాల ఎంపిక కీలకం

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే : రబీలో మేలైన వంగడాలు ఎంచుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేశ్ సూచించారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురవడంతో ఎలాంటి నీటి సమస్య ఉండదని తెలిపారు. రైతులు ప్రస్తుతం నాణ్యమైన ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలు ఎంచుకోవాలని ఆయన పేర్కొన్నారు.


ఉల్లి సాగు

- వరిలో అగ్గి తెగులును తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు ఎంచుకోవాలి. ఇందులో స్వల్పకాలిక (120 రోజులు) రకాలు ఎంచుకుంటే మేలు. కాటన్ దొర సన్నాలు (ఎంటీయూ-1010), విజేత (ఎంటీయూ-1001), ఐఆర్-64, ప్రభాత్ (ఎంటీయూ-3626), నెల్లూరి మసూరి (ఆర్‌పీఎన్ఆర్-34449), తెల్లహంస (ఆర్ఎన్ఆర్-10754), ఎర్రమల్లెలు (డబ్ల్యూఎల్-20471), జగిత్యాల సన్నాలు (జేజీఎల్-1798) మంచి ఫలితాలు ఇస్తాయి.
- జగిత్యాల సాంబ, అంజన, శ్వేత, తరంగ్, తెలంగాణ సోనా, బతుకమ్మ వంటి రకాలు సాగుకు అనుకూలం.
- మొక్కజొన్న, వేరుసెనగ, పప్పు శనగ, పొద్దుతిరుగుడు, మినుములు, నువ్వులు, ఆవాలు, రాగి, తెల్లజొన్న, ఉలువ, పెసర వంటి పంటలు సాగు చేసుకోవచ్చు. అపరాల సాగు లాభదాయకంగా ఉంటుంది.
- ఉల్లి సాగు ఎంతో లాభదాయకం. ఎకరానికి సుమారు 100-150 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు. మార్కెట్లో ఇప్పుడు మేలైన వంగడాలు వచ్చాయి. ఎరుపు రంగు గడ్డకంటే లేత ఎరుపు రంగు ఉల్లికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎలాంటి మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు.

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో పాము పొడ తెగులు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- మాసన్న, దుప్పల్లి

✔ లీటరు నీటికి థిఫ్లూజమిడ్ 0.75 మి.లీ లేదా హెక్సాకోనోజోల్ 2 మి.లీ లేదా ప్రొపికోనోజోల్ 1 మి.లీ లేదా ట్రైఫ్లాక్సీస్ట్రాబిన్ + టెబ్యూకోనోజోల్ 0.4 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

? వేరుసెనగలో పొగాకు లద్దె పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- బాలరాజు, నిర్వేన్

✔ న్యూవులురాన్ 1 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? టమాటాలో ఆకుమాడు తెగులు నివారణకు చర్యలు తెలపండి

- వెంకటయ్య, చెన్నారం

✔ లీటరు నీటిలో కాప్టాన్ 3 గ్రాములు లేదా కార్బండిజియం + మ్యాంకోజోబ్ 2.5 గ్రాములు లేదా ప్రొపికోనోజోల్ ఒక మి.లీ లేదా అజాక్సిస్ట్రోబిన్ + టెబ్యూకోనోజోల్ 1.2 మి.లీ మందును కలిపి ఆకులు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.


- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం

- న్యూస్‌టుడే, మదనాపురం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యకు కృషి

సినీనటి మంచు లక్ష్మి


గద్వాల కలెక్టర్ సంతోష్‌తో మాట్లాడుతున్న సినీనటి మంచు లక్ష్మి

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, మౌలిక వసతుల కల్పనకు తమ సంస్థ కృషి చేస్తోందని టీచ్ ఫర్ ఛేంజ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, సినీనటి మంచు లక్ష్మి పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆలూరు గ్రామంలో డిజిటల్‌క్లాస్ నిర్మాణం ప్రారంభించేందుకు వచ్చిన ఆమె సోమవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పెగసిస్ సిస్టం కంపెనీ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. గతంలో గట్టు మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌ల నిర్మాణం చేపట్టామని.. త్వరలో మరో 20 పాఠశాలలు నిర్మిస్తామని ఆమె చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంస్థ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 140 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీ సీఈవో కాంతమ్మ, డీఈవో రవీందర్‌లు పాల్గొన్నారు.

శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌ల పర్యటన


ఉండవల్లి బస్వాపురంలో శిక్షణ అధికారులకు పూలమొక్కలు అందజేసి, బతుకమ్మతో స్వాగతిస్తున్న అధికారులు

ధరూరు, ఉండవల్లి, మానవపాడు, ఇటిక్యాల, న్యూస్‌టుడే: ధరూరు మండల పరిధిలోని ఉప్పేరులో శిక్షణ ఐఏఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాదు, జోగులాంబ గద్వాల జిల్లాలలో ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామానికి 5 మంది చొప్పున 125 మంది శిక్షణ అధికారులు వచ్చారు. 3 రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలు, సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులు, కనీస వసతుల కల్పన తదితర అంశాలపై నివేదిక రూపొందించనున్నారు.

- ఉండవల్లి మండలం బస్వాపురం గ్రామానికి శిక్షణ అధికారులు లోకేష్‌కుమార్ (ఐఎస్ఎస్), రామకృష్ణ శరన్ (ఐపీఎస్), ప్రతీక్ గహ్లోట్(ఐపీఎస్), అతుల్ కుమార్‌సింగ్ (ఐఆర్ఎస్ ఐటీ), హిమాన్షు త్యాగి (ఐఎఫ్ఓఎస్) సోమవారం వచ్చారు. మానవపాడు మండలానికి 5 మంది శిక్షణ ఐఏఎస్ అధికారులు రాజీవ్.కె, వల్లి.ఎన్, ప్రసన్నకుమార్.వి, విజయ్ లధా, సాయలి అశోక్ గైక్వాడ్‌లు మండలంలోని కలుకుంట్ల గ్రామానికి సోమవారం చేరుకున్నారు. ఇటిక్యాల మండలంలోని కోదండాపురంకు సోమవారం శిక్షణా సివిల్ సర్వీస్ అధికారులు వచ్చారు. 2021 బ్యాచ్‌కు చెందిన లోకేష్ యాదవ్ (ఐపీఎస్), డింపుల్ యాదవ్(ఐఎస్ఎస్), బస్వారాజ్ ఎం వాలీకర్(ఐపీవోఎస్), నిఖితా యాదవ్(ఐసీఎల్ఎస్), 2022 బ్యాచ్‌కు చెందిన ఇంద్రజిత్ సిరా(ఐఎఫ్‌వోఎస్)లు ఉన్నారు. మల్దకల్ మండల పరిధిలోని పెద్దతాండలో శిక్షణ ఐపీఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. వికాస్, పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి, ఐఎఫ్ఓఎస్ ఆదాం మోహియిద్దీన్, ఐపీఓఎస్ పుష్కర వర్మ, ఐపీఎస్ హర్షత్‌కుమార్ ఆలావాత్, తాండాలో పర్యటించి ఆర్థిక, సామాజిక అంశాలపై ముచ్చటించారు.

శ్రీశైలంలో నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. ఎగువన ఉన్న జూరాల, సుంకేశుల జలాశయాలు పూర్తిగా నిండటంతో దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ప్రాజెక్టు 5 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి 1,17,539 క్యూసెక్కులు, సుంకేశుల జలాశయం నుంచి 51,324 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. శ్రీశైలం కుడి ఎడమ జల విద్యుత్ కేంద్రాల ద్వార 66,203 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వార 1,38,770 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు జలాశయంలో నీటి మట్టం 884.30 అడుగులకు, నీటి నిల్వ 211.4759 టీఎంసీలుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కొలువులు ఇచ్చే కొత్త కోర్సులు

- టాటా సంస్థ భాగస్వామ్యంతో మూడు ఐటీఐల్లో అమలు
- 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ



ఐటీఐ కళాశాలలో కొత్త కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న యువతులు

న్యూస్‌టుడే, పాలమూరు: విస్తృత ఉపాధి అవకాశాలు లభించే ఆరు అధునాతన సాంకేతిక కోర్సులు పాలమూరు యువతకు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం దిగ్గజ కంపెనీ టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 65 ప్రభుత్వ ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలు (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ - ఏటీసీ)గా ఉన్నతీకరిస్తున్నారు. తొలి విడతగా ఈ ఏడాది 28 కళాశాలలు ఎంపిక చేయగా అందులో మహబూబ్‌నగర్(బాలికల), మన్ననూర్, వనపర్తి ఐటీఐలు ఉన్నాయి.

ఒక్కో కళాశాలలో 172 సీట్లు : ఒక్కో కళాశాలలో ఆరు కొత్త కోర్సుల్లో కలిపి 172 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యువత ప్రవేశాలకు అర్హులు. ఈ నెల 30 వరకు దరఖాస్తులను అంతర్జాలం నుంచి స్వీకరిస్తారు. తర్వాత కోర్సులు ప్రారంభమవుతాయి. ఉమ్మడి జిల్లాలో బాలికల ఐటీఐ కళాశాల మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనే ఉంది. ఈ కోర్సుల్లో మూడేళ్ల పాటు టాటా ప్రతినిధులే శిక్షణ ఇస్తారు. తర్వాత వివిధ పరిశ్రమల్లో వారికి ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తారు. ఎస్ఎస్‌సీ, కుల, బోనఫైడ్, స్థానికత ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ఫొటో స్కాన్ చేసి http://iti.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

23న పనులకు శంకుస్థాపన : మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రాంగణంలో బాలికలు, బాలురకు వేర్వేరుగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు వెచ్చించే నిధులను 85 శాతం టాటా, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. వాటిలో అన్ని రకాల యంత్ర సామగ్రి, పరికరాలు, ఫర్నిచర్, ఇతర సదుపాయాలు కల్పిస్తారు. ఈ పనులకు ఈ నెల 23న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మహబూబ్‌నగర్‌లో శంకుస్థాపన చేయనున్నారు.

- మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ - ఏడాది **40**
- ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ - ఏడాది **40**
- బేసిక్ డిజైనర్, వర్చ్యువల్ వెరిఫైర్ - రెండేళ్లు **24**
- ఆర్టిసన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్ - ఏడాది **20**
- అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్ - రెండేళ్లు **24**
- మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ - రెండేళ్లు **24**



సద్వినియోగం చేసుకోవాలి.. : రాబోయే కాలంలో భారీ డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకుంటే కొలువులు లభిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం, టాటా కంపెనీ కలిసి నిర్వహించే ఆరు కొత్త కోర్సులను ఉమ్మడి జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలి. అర్హులందరూ త్వరగా దరఖాస్తు చేసుకోవాలి. సందేహాల నివృత్తికి 83742 50330, 95500 54418, 98484 66028 నంబర్లలో సంప్రదించొచ్చు.


- గోపాల్ నాయక్, ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, మహబూబ్‌నగర్

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

వివరాలు గోప్యంగా ఉంచిన ఉపాధ్యాయులు


శాయిన్‌పల్లి పాఠశాల వద్ద అస్వస్థతకు గురైన విద్యార్థులు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన బిజినేపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. శాయిన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన చిన్నారుల్లో 15 మంది వాంతులు చేసుకున్నారు. ఉపాధ్యాయులు బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం విద్యార్థులను పాఠశాల వద్ద వదిలిన ఉపాధ్యాయులు ఎంఈవోకు గాని, తల్లిదండ్రులకు గాని సమాచారం ఇవ్వకుండానే సాయంత్రం ఇంటికి వెళ్లిపోయారు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడంతో కొందరు విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే వేచి ఉన్నారు. గ్రామస్థులు ఆరా తీయడంతో విషయం బయటకు తెలిసింది. ఎంఈవో రఘునందన్‌శర్మను వివరణ కోరగా, విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా తెలిసిందన్నారు. మంగళవారం పాఠశాలను సందర్శించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానన్నారు.

ఆటో ఢీకొని మహిళ మృతి

ముగ్గురు పిల్లలకు గాయాలు

కృష్ణా, న్యూస్‌టుడే : హిందుపూర్, టైరోడ్ మధ్య ఆటో ఢీకొని కర్రెమ్మ(60) అనే మహిళ మృతి చెందింది. కృష్ణా పోలీసుల కథనం ప్రకారం సోమవారం సాయంత్రం కర్ణాటకలోని శక్తినగర్ నుంచి ప్రయివేటు పాఠశాల విద్యార్థులను హిందుపూర్‌కు ఆటో తీసుకువస్తుండగా మహిళ అడ్డం రావడంతో ఆటో అదుపు తప్పి ఆమెను ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ కర్రెమ్మను ప్రయివేటు వాహనంలో మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలిది గుడేబల్లూర్‌గా పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కతలప్ప తెలిపారు.

బాలికతో వెట్టి.. ఆపై దొంగతనం నెపం

- మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం
- జోగులాంబ గద్వాల జిల్లాలో దారుణం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని ఓ సీడ్ ఆర్గనైజర్ తన ఇంట్లో బాలిక(16)తో వెట్టి చాకిరి చేయించుకోవడంతోపాటు దొంగతనం నెపం మోపడంతో ఆ బాలిక పురుగు మందు తాగింది. సామాజిక మాధ్యమాల్లో సోమవారం వైరల్‌గా మారిన ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక గద్వాలలో నివాసం ఉంటున్న సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో గత కొన్నేళ్లుగా పని చేస్తోంది. తన ఇంట్లో బంగారు ఆభరణాలు పోయాయని, ఇంట్లో పని చేసే బాలికే ఈ పనికి పాల్పడిందని మల్దకల్ ఠాణాలో ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ఠాణాకు పిలిపించి విచారించారు. తర్వాత చోరీ ఘటన తమ పరిధిలో లేదంటూ సీడ్ ఆర్గనైజర్‌కు వివరించారు. తాను దొంగతనం చేయకున్నా నింద మోపారని మనస్థాపం చెందిన బాలిక ఈనెల 12న తన ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను కుటుంబ సభ్యులు గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఏపీలోకి కర్నూలుకు తీసుకెళ్లారు. బాలిక ఆరోగ్యం మరింతగా విషమించడంతో వైద్యులు ఏఎంసీలో ఉంచి వెంటిలేటరుపై చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో బాలిక తల్లి మల్దకల్ ఠాణాలో ఇంటి యజమానిపై ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గద్వాల డీఎస్పీ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా సంఘటనపై విచారణ జరుపుతున్నామని, బాలిక తల్లి ఫిర్యాదుపై వెట్టిచాకిరి చేయించుకుని దొంగతనం నెపంతో బాలిక ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సీడ్ ఆర్గనైజర్‌పై మల్దకల్ ఠాణాలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రైలు కింద పడి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉండే గుర్తుతెలియని పురుషుడు బండమీదిపల్లి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యులు ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

మేమున్నాం.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు

మీకు తోడుగా..

నాగర్‌కర్నూలు	7993300530
అచ్చంపేట	8008573927
కల్వకుర్తి	9908803650
కొల్లాపూర్	8008573870

? పురపాలిక పరిధిలో సేకరిస్తున్న చెత్తను మదురానగర్ కాలనీ ఈద్గా సమీపంలో పడేస్తున్నారు. అక్కడే నిప్పు పెట్టడంతో నిరంతరం పొగ, దుర్వాసన వస్తోంది. - విష్ణు



✔ మదురానగర్ కాలనీ (ఈద్గా) సమీపంలో చెత్త వేయకుండా చర్యలు చేపడతాం. చెత్త సేకరించే ప్రతి వాహనం డంపింగ్ యార్డుకు వెళ్లేలా ఆదేశిస్తాం. - శ్యాంసుందర్, పుర కమిషనర్

- న్యూస్‌టుడే, అచ్చంపేట న్యూటౌన్

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : దేవర
రమణ : వేట్టయన్ ద హంటర్, రామకృష్ణ
ఇద్దరు, కల్వకుర్తిలో.. పార్థసారథి : దేవర
అశోక్ : వేట్టయన్ ద హంటర్

కూరగాయల ధరలు కిలో.. రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాట 60, వంకాయ 60, బెండ 64, మిరప 85, కాకర 64, బీర 64, క్యాలిఫ్లవర్ 74, క్యాబేజీ 45, క్యారెట్ 64, దొండ 50, ఆలుగడ్డ 44, ఉల్లిగడ్డ 58, గోకర 64, దోస 44, ఆనంకాయ 18, చిక్కుడు 64, మునగకాయ 74, బీట్‌రూట్ 50, ఖీర, 45, బీన్స్ 95.

పశువైద్యం.. దయనీయం

సిబ్బంది కొరతతో పశువులకు అరకొర వైద్యం



బిజినేపల్లి మండలం వట్టెంలోని పశువైద్యశాల భవనం

బిజినేపల్లి, న్యూస్‌టుడే : వ్యవసాయాధారిత జిల్లాలో పశువుల సంఖ్యకు అనుగుణంగా పశువైద్యశాలలు లేవు. ఉన్న ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో పశువులకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా వైద్యశాలకు నుంచి కింది స్థాయి సహాయకుడు (అటెండర్) వరకు పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పశువైద్యం అందక రైతులు అవస్థలు పడుతున్నారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 94 పశువైద్య కేంద్రాలు, పశు వైద్య ఉపకేంద్రాలు, మొబైల్ క్లినిక్‌లు ఉన్నాయి. ఇందుకు గానూ మొత్తం 194 మంది వివిధ స్థాయి సిబ్బంది అవసరం ఉండగా 147 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. చాలా పశు వైద్య కేంద్రాల్లో శస్త్రచికిత్సలు చేసే వారు లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది వైద్యం చేస్తున్నారు. చాలా పశు వైద్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది వేళకు విధులకు హాజరు కావడం లేదనే విమర్శలున్నాయి. సరైన మందులు లేని కారణంగా ప్రైవేట్ మెడికల్ దుకాణాల్లో మందులు కొనుగోలు చేసుకోవడం ఆర్థిక భారంగా మారిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పశు వైద్య సిబ్బంది వివరాలు ఇలా..

సిబ్బంది	మొత్తం	పని చేస్తున్న వారు	ఖాళీలు
పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు	33	19	14
లైవ్ స్టాక్ అధికారి	08	04	04
జూనియర్ వెటర్నరీ అధికారి	14	12	02
లైవ్‌స్టాక్ అసిస్టెంట్	34	10	24
వెటర్నరీ అసిస్టెంట్	27	26	01
ఆఫీస్ సబార్డినేట్	78	76	02
మొత్తం	194	147	47

ఉన్న సిబ్బందితోనే సేవలు..

పశు వైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. అవసరమైన సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉన్న సిబ్బందితోనే పశు వైద్య సేవలు అందిస్తున్నాం. - రమేశ్, జిల్లా పశువైద్యాధికారి

ప్రగతి పథంలో పల్లెలు



ఎంగంపల్లి గ్రామ ఎంగమ్మకుంటలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మత్స్యశాఖ ఏడీ రజని

కల్వకుర్తి, న్యూస్‌టుడే : పల్లెలు ప్రగతికి చేయూతనిస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తాండ్ర గ్రామంలో రూ.30లక్షలతో సీసీ రహదారుల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఎంగంపల్లి గ్రామ ఎంగమ్మ కుంటలో చేపపిల్లలను వదిలారు. ఎంగంపల్లిలో జరిగిన సభలో మాట్లాడారు. కల్వకుర్తి డివిజన్‌కు 36లక్షల చేప పిల్లలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బంగారు తీగల రకం చేప పిల్లలు చిన్నవిగా ఉన్నాయని, చెరువులో వదిలిన వెంటనే చనిపోతాయని మత్స్యకార్మికులు ఆందోళనతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అదనంగా 12లక్షల చేప పిల్లలు తీసుకురావాలని అక్కడే ఉన్న మత్స్య శాఖ ఏడీ రజనిని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, మాజీ సర్పంచి ఆనంద్‌కుమార్, నాయకులు సాయిరెడ్డి, ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, విక్రమ్‌రెడ్డి, విజయ్‌కుమార్, కిరణ్, చంద్రయ్య పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే : చారకొండ మండలంలో 156 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించినట్లు ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ తెలిపారు. సోమవారం చారకొండ కేంద్రంలో లేవుట్ల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులపై ఎంపీవో వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి గజేశ్‌తో కలిసి ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఆరు గ్రామ పంచాయతీల్లో క్రమబద్ధీకరణ కోసం 1,563 దరఖాస్తులు రాగ వాటిలో 156 క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. మరో 1407 పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటికి సంబంధించిన పత్రాలతో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలన్నారు. అనుమతి లేని లేఅవుట్లు, ఇళ్ల స్థలాల చిత్రాలను తీసి యాప్‌లో నమోదు చేస్తామన్నారు.

రూ.11 కోట్లతో బీటీ రహదారులు



తిమ్మినోనిపల్లి దారిని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ శాఖ డీఈఈ చంద్రశేఖర్

కల్వకుర్తి, న్యూస్‌టుడే: త్వరలో రూ.11 కోట్లతో బీటీ రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల్లో మంజూరైన మూడు రోడ్ల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేపట్టినట్లు చెప్పారు. మట్టి రహదారుల స్థితిగతులను పరిశీలించి ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిపాదనలు పూర్తి అయిన వెంటే పనులు చేపట్టడానికి టెండర్లు ఆహ్వానిస్తామని వివరించారు. వెల్దండ మండలం తిమ్మినోనిపల్లి నుంచి రాచూరు తండా వరకు 4.5 కిలోమీటర్ల దూరం రూ.2.5 కోట్లు, కల్వకుర్తి మండలం ఎంగంపల్లి నుంచి మార్చాల వరకు నూతనంగా చేపట్టే రోడ్డు నాలుగు కిలోమీర్లు రూ.4కోట్లు, చారకొండ మండలం రాంపూర్ నుంచి చారకొండకు నాలుగు కిలోమీటర్లు రూ.3.5 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సర్వేలో ఏఈ మణిపాల్ పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పుతో ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. స్వరాజ్యలక్ష్మి

కందనూలు, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండటానికి ఆహారంలో తగినంత అయోడిన్ ఉప్పు వాడాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. స్వరాజ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ అయోడిన్ లోపం రుగ్మతల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో పాల్గొని మాట్లాడారు. పిల్లల మానసిక వికాసానికి, శారీరక పెరుగుదలకు అయోడిన్ అత్యవసరమన్నారు. అయోడిన్ ఉప్పు వలన కలిగే ప్రయోజనాలపై విద్యార్థినులు తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపవైద్యాధికారి డా. వెంకట్‌దాస్, ప్రోగ్రాం అధికారులు డా. శ్రీనివాసులు, డా. నారాయణస్వామి, ఆర్. శ్రీనివాసులు, విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

తెలకపల్లి, న్యూస్‌టుడే : రాకొండ కస్తూర్బా పాఠశాలలో 2 పోస్టుల భర్తీకి ఈ నెల 22న మండలానికి చెందిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 18 నుంచి 45ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలు స్కావెంజర్ పోస్టుకు 7వ తరగతి, అటెండర్ పోస్టుకు 10వ తరగతి చదివిన అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

ఇసుక పై నిషేధం ఎత్తివేయాలి

కల్వకుర్తి, న్యూస్‌టుడే : ఇసుక లభ్యత లేక ఇళ్ల నిర్మాణ పనులు ఆగి ఉపాధి కోల్పోయామని కార్మికులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముందు వాపోయారు. ఇసుకపై [illegible] నిషేధం ఎత్తేసి ఉపాధి మార్గాలు చూపాలని కోరారు. సోమవారం పట్టణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్మిక సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో దర్శన్‌రెడ్డి, యాదయ్య, రాజు, ప్రభాకర్‌రెడ్డి, శ్రీను, బాలమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ : ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

ఎస్పీ కార్యాలయానికి 13 ఫిర్యాదులు

కందనూలు, న్యూస్‌టుడే : జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 13 ఫిర్యాదులు నమోదైనట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సూచించారు. భూమి పంచాయతీలు 10, ఇతర రకాల సమస్యలకు సంబంధించి 3 ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిశీలించి బాధితులకు త్వరగా న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థుల హాజరు పెంచాలి

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, హాజరు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈవో చంద్రుడు అన్నారు. సోమవారం వెల్దండ మండలం గుండాల, చెదురుపల్లి, గుండాల, ఉబ్బలగట్టు తండా, దేశిగానితండా, సల్లపల్లి, బొల్లంపల్లి, బండోనిపల్లి, చొక్కన్నపల్లి, ఈదమ్మబండ తండా పాఠశాలలతో పాటు గుండాల ఏకలవ్య విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల, విద్యార్థుల ఉపస్థితి, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ పర్దీప్‌కుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనువాసులు, సీఆర్పీ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో చంద్రుడు

పంట నష్ట పరిహారం చెల్లించండి

అచ్చంపేట, న్యూస్‌టుడే : భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం మంజూరు చేయాలని మాజీ మంత్రి, భాజపా నేత పి. రాములు డిమాండ్ చేశారు. సోమవారం అచ్చంపేటలో సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు. రైతు భరోసా నిధులు జమ చేయకపోవడంతో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే భారీ వర్షాలకు నష్టం వాటిల్లిందన్నారు. సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ప్రతి కార్యకర్త వంద మందితో సభ్యత్వం చేయించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండికారి బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, నియోజకవర్గ కన్వీనర్ రేణయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాములు

చట్టాలపై అవగాహన తప్పనిసరి

తాడూరు, న్యూస్‌టుడే : మహిళల రక్షణ, పోక్సో చట్టాలపై ప్రతి ఒకరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా షీ టీమ్ ఇన్‌ఛార్జ్ విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు డయల్ 100 లేదా చరవాణి నంబరు : 8712657676కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. భరోసా కేంద్ర సహాయకురాలు శ్రీలత, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు, షీ టీమ్ సభ్యులు వెంకటయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షీ టీమ్ ఇన్‌ఛార్జ్ విజయలక్ష్మి

బదిలీపై వెళ్తున్న జడ్జికి ఘన సన్మానం

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే: కొల్లాపూర్ కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర్‌వీఎస్ఎస్ మిథున్‌తేజ అలంపూర్ కోర్టుకు బదిలీపై వెళ్తుండటంతో కొల్లాపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం కోర్టు ఆవరణలో శాలువ, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో 1వ అదనపు సివిల్ జడ్జి జ్యోత్స్నలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహరి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



కొల్లాపూర్ కోర్టు జడ్జి ఆర్‌వీఎస్ఎస్ మిథున్‌తేజను సన్మానిస్తున్న బార్‌అసోసియేషన్ న్యాయవాదులు, సిబ్బంది

బల్మూర్ ఎస్సై బదిలీ

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే: బల్మూర్ ఎస్సై గురుస్వామి బదిలీ అయ్యారు. ఈ ఏడాది జులైలో బాధ్యతలు చేపట్టిన ఎస్సై కొద్ది రోజుల్లోనే నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని తాడూర్ మండల కేంద్రానికి బదిలీ కావడంతో సోమవారం ఠాణా నుంచి రిలీవ్ అయ్యారు.

తాడూరు ఎస్సైగా గురుస్వామి

తాడూరు, న్యూస్‌టుడే : తాడూరు ఎస్సైగా గురుస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై మహేశ్ బదిలీపై ఉండవల్లికి వెళ్లగా, ఆయన స్థానంలో బల్మూర్ ఎస్సైగా పని చేసిన గురుస్వామి ఇక్కడికి వచ్చారు.

అగ్నికుల క్షత్రియ సంఘం కార్యవర్గం

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ నియోజకవర్గంలోని అగ్నికుల క్షత్రియ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని మాధవస్వామి ఆలయంలో సమావేశమై అధ్యక్షుడుగా హరిప్రసాద్ పాండ్యా, ఉపాధ్యక్షుడుగా మహేశ్వర్‌సింగ్, ప్రధానకార్యదర్శిగా గోవింద్ సింగ్ కోశాధికారిగా రాధాకిషన్‌సింగ్, కన్వీనర్‌గా సుధాకర్‌సింగ్, గౌరవఅధ్యక్షులుగా సురేందర్‌సింగ్, దశరథ్‌సింగ్, శివరాంసింగ్, సురేందర్‌సింగ్, సలహాదారులుగా మరికొంతమందిని ఎనుకున్నారు. యూత్ అధ్యక్షుడుగా శివశంకర్‌సింగ్, లక్ష్మీనారాయణపాండేను ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్ తెలిపారు.

వసతిగృహం నుంచి పారిపోయిన విద్యార్థులు

కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసులు

వనస్థలిపురం, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాల వసతిగృహం నుంచి రాత్రి వేళ ఇద్దరు విద్యార్థులు తప్పించుకొని పోయిన ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు.. వనస్థలిపురం వెంకటరమణ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆదివారం రాత్రి 12.30 గంటల సమయంలో ఇద్దరు విద్యార్థులు.. మూడో అంతస్తు నుంచి కిందకు వచ్చి, గేట్ పక్కనున్న పాత గ్రిల్స్‌ను తొలగించి బయటకొచ్చారు. పాఠశాల సమీపంలోని హస్తినాపురం చౌరస్తా నుంచి ఆటోలో సంతోశ్‌నగర్ చౌరస్తాకు చేరుకున్నారు. రాత్రి సమయంలో గ్రామానికి వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో అక్కడే నిద్రించారు. స్వగ్రామానికి వెళ్లేందుకు ఓ విద్యార్థి ఉదయమే బస్సు ఎక్కగా, బస్సులు లేకపోవడంతో మరో విద్యార్థికి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. అప్పటికే పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఇద్దరిని గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

మైలారం మైనింగ్ అనుమతులను రద్దు చేయాలి



సిపిఎం మహసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పర్వతాలు

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే: మండలంలోని మైలారం గుట్ట పై పలుగురాళ్ల (మైనింగ్) అనుమతులను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మైనింగ్ తవ్వకాల వల్ల ప్రకృతి, పక్షులు, మొక్కలు నాశనం అవుతాయని, గ్రామంలోని పశువులు, మేకలకు ఆహారం లభిస్తుండడంతో అధికారులు పునరాలోచించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి ఆంక్షలు విధించడం వల్ల అనేక మంది రైతులు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. బల్మూర్, లింగాల మండలాల కార్యదర్శిగా శంకర్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేశ్యానాయక్, లాల్‌హైమద్, మల్లేశ్, మహేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. రక్తదానం చేసిన 180 మందికి గుర్తింపు పత్రాలు అందజేశారు. సీఐ రవీందర్, లయన్స్ క్లబ్ రీజియన్ ఛైర్మన్ శ్రీనివాసులు, డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్, ఎస్సైలు పాల్గొన్నారు.



దాతలకు గుర్తింపు పత్రాలు అందజేస్తున్న లయన్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్



కొల్లాపూర్‌లో నినాదాలు చేస్తున్న సిఐటియు హమాలీ కార్మికులు

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. సోమవారం పట్టణంలోని కార్మికుల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏటా రెన్యువల్స్ రూపంలో లక్షల రూపాయలు చెల్లిస్తున్న సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయక పోవడం దుర్మార్గమన్నారు. హమాలీ కార్మికులకు ఉండటానికి అడ్డాలు, విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దశరథం, బాలయ్య, శ్రీనివాసులు, బురాన్, కురుమయ్య, బాలకృష్ణ; వెంకటస్వామి, రాజేష్, చిరంజీవి, రవి, తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ : యువకుడు దుర్మరణం..

వంగూరు, న్యూస్‌టుడే : మండలంలోని తిర్మలగిరి వద్ద ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్‌ను వేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రానికి చెందిన బుచ్చాచారి (27) శ్రీశైలం, హైదరాబాద్ ప్రధాన రహదారిపై తిర్మలగిరి స్టేజి వద్ద ఉన్న పెట్రోల్‌బంక్‌లో ఆదివారం రాత్రి తన బైక్‌లో పెట్రోల్ పోసుకొని తిరిగి డిండి వస్తున్నాడు. అచ్చంపేట నుంచి అతివేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందిన్నట్లు చెప్పారు. కారును స్వాధీనం చేసుకొని మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుచ్చాచారికి భార్య నాగమణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వివాహిత ఆత్మహత్య.. కందనూలు, న్యూస్‌టుడే : మండలంలోని పెద్దాపూర్‌లో పవిత్ర (23) అనే వివాహిత సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లిన తరువాత ఇంట్లో ఉరేసుకుంది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం శవపంచనామ నిమిత్తం మృతదేహాన్ని పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. వివాహిత మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై ఎస్సై గోవర్దన్‌ను వివరణ కోరగా బాధితులు ఫిర్యాదు చేయలేదన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి.. కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు (23) మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. కల్వకుర్తి మండలం మార్చాల శివారులో జాతీయ రహదారిపై రాత్రి ఒంటిగంట సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నల్లని దుస్తులు ధరించి ఉన్నాడని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఎవరైన గుర్తిస్తే ఠాణాలో సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం.. తెలకపల్లి, న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకుని ఠాణాకు తరలించారు. కమ్మారెడ్డిపల్లికి చెందిన డ్రైవర్ రోహిత్ నడిగడ్డ గ్రామ సమీపంలోని దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

అడవి జంతువు దాడిలో మేకలు మృతి.. వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : గుర్తు తెలియని అడవి జంతువు దాడిలో తొమ్మిది మేకలు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వెల్దండ గ్రామానికి మోర సైదమ్మ కౌలుకు తీసుకున్న పొలంలో చిన్నపాటి మేకల షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం 9మేకలను కొనుగోలు చేసి అందులో ఉంచి ఇంటికి వచ్చారు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో మేకలన్ని మృతి చెంది ఉన్నాయి. ఘటనా స్థలాన్ని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి కురుమంతి పరిశీలించారు. నక్క దాడి చేసి ఉంటుందని తెలిపారు. వీటి విలువ రూ. లక్ష ఉంటుందని బాధితురాలు తెలిపింది. బీట్ అధికారి లలిత, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అలీం, పర్వతాలుగౌడ్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి..

లింగాల, న్యూస్‌టుడే : ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చెన్నంపల్లి గ్రామానికి చెందిన సైదమ్మ (35) భర్త లింగస్వామి ఈ నెల 13న గొడవపడ్డారు. అదే రోజు రాత్రి మనస్తాపంతో సైదమ్మ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. ఆమెను నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం హైదరాబాదు నిమ్స్‌కు తరలించి చికిత్స చేస్తుండగా సోమవారం ఉదయం మృతి చెందింది.

మోసం చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలి..

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే: మాయ మాటలతో నమ్మించి శారీరకంగా వాడుకున్న వ్యక్తిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. జినుకుంట గ్రామానికి చెందిన యువకుడు వివాహం చేసుకుంటానని నమ్మించడంతో బాధిత మహిళ గర్భం దాల్చింది. ఆగస్టులో బల్మూర్ ఠాణాలో ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోక పోవడంతో సోమవారం ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేసింది. పది రోజుల క్రితం మగ శిశువుకు జన్మనిచ్చింది. ఉన్నతాధికారులు నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. సీఐ రవీందర్‌ను వివరణ కోరగా విచారణ చేసి నిందితుడిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

వంగూరు, న్యూస్‌టుడే : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా మాతా శిశు ఆరోగ్య సంరక్షణ అధికారి డా. లక్ష్మణ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. గర్భిణులు ప్రతి నెలా పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేయించాలని ఆశ కార్యకర్తలను కోరారు. కల్వకుర్తి డివిజన్ ఉప వైద్యాధికారి డా.భీమానాయక్, డా.శ్రుతి, కల్వకుర్తి సీహెచ్‌వో శ్రీనివాస్, సూపర్‌వైజర్లు పద్మ, రోజమ్మ తదితరులు ఉన్నారు.



పీహెచ్‌సీలో దస్త్రాలను పరిశీలిస్తున్న డా.లక్ష్మణ్

కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర

వెల్దండ, న్యూస్‌టుడే : పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని వెల్దండ సింగిల్ విండో ఛైర్మన్ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం వెల్దండ సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్‌ఛైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు నాగులు నాయక్, శేఖర్, గండేయ్యా, వెంకటయ్యగౌడ్, జంగయ్యా, మండల వ్యసాయాధికారి శోభరాణి పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

తెలకపల్లి : నాగర్‌కర్నూల్ మండలం మంతటి సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 22న నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం నిరంజన్ తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సులు చదివిన 18 ఏళ్ల పై బడిన నిరుద్యోగ యువత ఆధార్ కార్డు, నిజ ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలలోపు హాజరు కావాలని కోరారు. వివిధ సంస్థలు, కంపెనీలు అర్హులను ఎంపిక చేస్తారన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఎన్నిక

వంగూరు, న్యూస్‌టుడే : ఎస్సీ వ్యతిరేక పోరాట మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముద్దమొల్ల పాండు, ఉపాధ్యక్షులుగా శ్యామ్, అశోక్, విజేందర్, ప్రధాన కార్యదర్శిగా సల్వాది సాయిబాబా, గౌరవ అధ్యక్షులుగా అంతయ్య, దొడ్డి విష్ణు, జలంధర్, జగన్‌లను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి కుంద ఆంజనేయులు సమక్షంలో ఎన్నిక జరిగింది.

భూ సమస్యలు పరిష్కరించాలని వినతి

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆక్రమణకు గురైన నక్షా దారిని పునరుద్ధరించడంతో పాటు భూపరమైన సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్తిక్‌కుమార్‌కు పలువురు రైతులు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి ఏళ్ల తరబడి నుంచి నక్షదారి గుండా తమంతా పొలాలకు వెళ్లి వస్తున్నామని, ఇటీవల పలువురు దారిని ఆక్రమించి రాకపోకలు సాగించకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. క్షేత్ర స్థాయిలో విచారించి న్యాయం చేయాలని రైతులు కోరారు. గొల్లోనిపల్లి గ్రామంలో తాము కొనుగోలు చేసిన పొలంలో పలువురు అక్రమంగా మైనింగ్ కోసం తవ్వకాలు జరిపి నష్టం చేస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని హైమావతి ఫిర్యాదు చేశారు. రాఘయిపల్లి గ్రామంలోని తన భూమిపై పట్టా మార్పిడి చేయవద్దని అలేటి నారాయణసాగర్ వినతిపత్రం అందజేశారు.

పోలీసుల సేవలు మరవలేనివి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే: అమరులైన పోలీసుల సేవలు మరవలేనివని ఎస్సై హృషికేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఠాణాలో అమరులైన పోలీసుల చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ సేవలో, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రక్షణగా ఉంటూ సేవలు అందిస్తున్న పోలీసు ఉన్నతాధికారులను, పోలీసులను దుండగులు మందుపాతరతో పేల్చి మట్టుబెటడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.